ప్రజలు బీఆర్‌ఎస్ సంక్షేమ పథకాలను మరిచిపోలేరు

బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి పద్మారావుగౌడ్

సికింద్రాబాద్, మే 7 (ఆంధ్రజ్యోతి): బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు ప్రజలు ఎప్పటికీ మరచిపోలేరని సికింద్రాబాద్ లోక్‌సభ నియోజకవర్గ బీఆర్‌ఎస్ అభ్యర్థి తీగుల్ల పద్మారావుగౌడ్ అన్నారు. సనత్‌నగర్ నియోజకవర్గంలోని బన్సీలాల్‌పేట్, భోలక్‌పూర్, బోయగూడ ప్రాంతాల్లో మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్‌తో కలిసి ఆయన మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. లోక్‌సభ ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసి బీఆర్‌ఎస్‌ను గెలిపించాలని కోరారు.


బన్సీలాల్‌పేట్‌లో ఓటర్లకు అభివాదం చేస్తున్న బీఆర్‌ఎస్ అభ్యర్థి పద్మారావు, తలసాని

అంబర్‌పేట నియోజకవర్గంలో

రాంనగర్, మే 7 (ఆంధ్రజ్యోతి): అంబర్‌పేట నియోజకవర్గంలోని క్రైస్తవులకు శ్మశాన వాటిక స్థలం ఏర్పాటుకు తనవంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ క్రైస్తవులకు హామీ ఇచ్చారు. ఎంపీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థి టి. పద్మారావుగౌడ్‌కు మద్దతు ఇచ్చి కేసీఆర్ నాయకత్వాన్ని బలపరచాలని కోరారు. క్రైస్తవ సంఘాల జేఏసీ చైర్మన్ సాల్మన్‌రాజ్ అధ్యక్షతన మంగళవారం బాగ్‌అంబర్‌పేటలో క్రైస్తవ చర్చిల పాస్టర్లు, క్రైస్తవ సంఘాల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో మైనారిటీలకు శ్మశాన వాటికకు స్థలం ఇవ్వడం జరిగిందని, అలాగే క్రైస్తవుల శ్మశాన వాటిక స్థలం ఇవ్వడానికి కృషి చేస్తామన్నారు.


క్రైస్తవ సంఘాల సమావేశంలో మాట్లాడుతున్న అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

పద్మారావుగౌడ్‌ను గెలిపించాలి

ముషీరాబాద్, మే 7 (ఆంధ్రజ్యోతి): బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి టి. పద్మారావుగౌడ్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని బీఆర్‌ఎస్ గ్రేటర్ యువజన కమిటీ సీనియర్ నాయకుడు ముఠా జైసింహా అన్నారు. మంగళవారం ముషీరాబాద్‌లోని ఆర్యవైశ్య భవన్‌లో భోలక్‌పూర్ డివిజన్ బీఆర్‌ఎస్ కమిటీ ఆధ్వర్యంలో పద్మారావుగౌడ్‌కు మద్దతుగా రూపొందించిన ఉర్దూ కరపత్రాన్ని ముఠా జైసింహా ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మైనార్టీలంతా బీఆర్‌ఎస్ వైపే ఉన్నారని అన్నారు.

వానలోనూ కేటీఆర్ రోడ్ షో

● భారీగా తరలివచ్చిన ప్రజలు

బర్కత్‌పుర/ నల్లకుంట మే 7 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షం అడ్డంకిగా మారినా కేటీఆర్ నిర్వహించిన రోడ్ షో అంబర్‌పేట నియోజకవర్గంలో సక్సెస్ అయింది ఒకవైపు భారీ వర్షం కురుస్తున్నా బీఆర్‌ఎస్ నాయకులు కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. వర్షం కారణంగా రెండున్నర గంటలు ఆలస్యంగా కేటీఆర్ తిలక్‌నగర్ రైల్వే బ్రిడ్జి వద్దకు చేరుకున్నారు. మంగళవారం రాత్రి 7.45 గంటలకు కేటీఆర్ ప్రత్యేక ప్రచార వాహనంలో బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి పద్మారావు గౌడ్, మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్. బీఆర్‌ఎస్ కార్పొరేటర్లు దూసరి లావణ్య శ్రీనివాస్ గౌడ్, పద్మావతి వెంకట్ రెడ్డి, విజయ్‌కుమార్‌గౌడ్. మాజీ కార్పొరేటర్లు పద్మావతి దుర్గాప్రసాద్ రెడ్డి, బి వెంకట్‌రెడ్డి తదితరులతో కలిసి వచ్చారు. అప్పటికి వర్షం తగ్గింది చిరుజల్లులు పడుతున్నప్పటికీ కార్యకర్తలు నాయకులు ప్రజలు గొడుగులు పెట్టుకొని కేటీఆర్ కోసం ఎదురు చూశారు.

కేటీఆర్ రాగానే ఈలలు కేకలతో స్వాగతం పలికారు. నియోజకవర్గంలోని ఐదు మున్సిపల్ డివిజన్ల నుంచి పెద్ద ఎత్తున ప్రజలు తరలివచ్చారు. రాత్రి 8.10 గంటలకు కేటీఆర్ ప్రసంగం ముగియగానే భారీ వర్షం కురిసింది. కేటీఆర్ తడిసి ముద్దయిపోయాడు.


రోడ్ షో లో మాట్లాడుతున్న కేటీఆర్

అంబర్‌పేట అభివృద్ధి బీఆర్‌ఎస్ ఘనతే

అంబర్‌పేట నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసిన ఘనత బీఆర్‌ఎస్‌దే అని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అన్నారు. తన సారథ్యంలోనే అంబర్‌పేట పూర్తిగా అభివృద్ధి సాధించిందని ఆయన స్పష్టం చేశారు. రూ.61 కోట్లతో రత్నానగర్, సత్యానగర్‌లో రిటైనింగ్ వాల్ నిర్మించామని, రూ.22 కోట్లతో ఫీవర్ ఆస్పత్రిలో ఓపీ బ్లాక్ నిర్మాణం జరుగుతుందన్నారు. అభివృద్ధిని విస్మరించిన కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిని. కారు గుర్తుతో గెలిచి పార్టీ ఫిరాయించిన దానం నాగేందర్‌ను చిత్తుగా ఓడించాలని పిలుపునిచ్చారు.

కాంగ్రెస్ అభ్యర్థులకు ఐక్యవేదిక మద్దతు

కవాడిగూడ , మే 7 (ఆంధ్రజ్యోతి): పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు తెలంగాణ మాజీ సర్పంచ్, ఎంపీటీసీ , జడ్పీటీసీ, ఎంపీటీసీ, కౌన్సిలర్ ఐక్య వేదిక రాష్ట్ర కమిటీ మద్దతు ఇస్తు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని రాష్ట్ర అధ్యక్షుడు మేడిశంకర్ విజ్ఞప్తి చేశారు. మంగళవారం ఇందిరాపార్కు వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి తమ సమస్యలను విన్నవించినట్లు తెలిపారు. అందుకే తమ సంఘం పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి మద్దతు ఇవ్వాలని నిర్ణయించినట్లు ఆయన తెలిపారు. సమావేశంలో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మోహన్‌రావు. శంకర్, మల్లికార్జున్‌గౌడ్, రామచంద్రయ్య, వడ్ల సాయిబాబ, రవి, గడల రాజు పాల్గొన్నారు.


ఆత్మీయ సమ్మేళనం కరపత్రాలను ఆవిష్కరిస్తున్న వినోద్‌యాదవ్

రేపు యాదవుల ఆత్మీయ సమ్మేళనం

బర్కత్‌పుర, మే 7 (ఆంధ్రజ్యోతి): యాదవుల ఆత్మీయ సమ్మేళనాన్ని ఈ నెల 9న నిర్వహిస్తున్నట్లు బీజేపీ ఓబీసీ మోర్చా నగర అధ్యక్షుడు వినోద్‌యాదవ్ తెలిపారు. మంగళవారం కాచిగూడ మహేంద్ర గార్డెన్‌లో ఆత్మీయ సమ్మేళనం కరపత్రాలను ఆవిష్కరించి ఆయన మాట్లాడారు. అంబర్‌పేటలోని బతుకమ్మకుంటలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మధ్యప్రదేశ్ సీఎం మోహన్‌యాదవ్, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొంటారని తెలిపారు. యాదవ కులస్థులు పెద్ద సంఖ్యలో సమ్మేళనంలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో యాదవ సంఘం చైర్మన్ నందకిషోర్‌యాదవ్, నాయకులు దయాకర్‌యాదవ్, మహేందర్‌యాదవ్, మల్లేష్‌యాదవ్, రవియాదవ్, తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థినితో వ్యాయామం చేయిస్తున్న పద్మాకమలాకర్

నో డైట్ డే పై అవగాహన

చిక్కడపల్లి, మే 7 (ఆంధ్రజ్యోతి): బాడీ షేమింగ్‌ను అంతం చేయడానికే నో డైట్ డే అని ప్రోగ్రెసివ్ సైకాలజిస్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షురాలు డా. పద్మాకమలాకర్ అన్నారు. అంతర్జాతీయ నో డైట్ డే సందర్భంగా మంగళవారం అశోక్‌నగర్‌లోని మైండ్ అండ్ పర్సనాలిటీ కేర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ సందర్భంగా సమావేశంలో పాల్గొన్నవారికి నో డైట్ డే గురించి అవగాహన కలిగిస్తూ ఏ ఆహారమైన మితంగా తీసుకోవాలన్నారు. ప్రతి ఏడాది అంతర్జాతీయ నో డైట్ డే ని ఆదర్శ శరీర ప్రమాణాలను విచ్ఛిన్నం చేయడం, శరీర వైవిధ్యాన్ని స్వీకరించే ప్రాముఖ్యతను నొక్కి చెప్పడానికి జరుపుకుంటారన్నారు. మెడిటేషన్, యోగా, నడవడం రోజూ 30 నిమిషాలు చేయాలన్నారు. పాల్గొన్నవారితో చిన్న చిన్న వ్యాయామాలను ప్రాక్టీస్ చేయించారు. షేక్ హాలిమా రూహి, హిమకర్, ఉషా, సాహితి, లలిత, రాణి విద్యార్థులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న శ్రీకృష్ణరాయబారం నాటక ప్రదర్శన

చిక్కడపల్లి, మే 7 (ఆంధ్రజ్యోతి): శివాని ఆర్ట్స్ ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి త్యాగరాయగానసభలో ప్రదర్శించిన శ్రీకృష్ణరాయబారం నాటక ప్రదర్శన ఆహూతులను ఆకట్టుకుంది. బాపనపల్లి శ్రీరామ్, మల్లాది రమణలు పాత్రలు పోషించి సభికులను రంజింపచేశారు. ఈ సందర్భంగా కళాప్రియులు మాల బాల స్వామి దంపతులను సన్మానించారు. కళాకారులకు మయూరి అవార్డులు అందజేశారు. కార్యక్రమంలో కళాప్రియులు నాగేందర్, నరేష్‌కుమార్, నాగేశ్వరరావు, ప్రముఖ నటుడు దొంతి జంగయ్యగౌడ్ పాల్గొని కళాకారులను అభినందించారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఆరె మహేందర్

బీసీ కులగణన చేస్తామన్న కాంగ్రెస్ ప్రకటన హర్షణీయం

చిక్కడపల్లి, మే 7(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ జాతీయస్థాయిలో బీసీ కుల గణన చేస్తామని బీసీ రిజర్వేషన్లు పెంచుతామని వారి పార్టీ మేనిఫెస్టోలో పెట్టినందుకు ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ఏఐసీసీ అగ్రనేత సోనియాగాంధీలకు తెలంగాణ బీసీ ఐక్యవేదిక కృతజ్ఞతలు తెలిపింది. ఈ సందర్భంగా మంగళవారం చిక్కడపల్లిలోని కార్యాలయంలో జరిగిన సమావేశంలో వేదిక రాష్ట్ర అధ్యక్షుడు ఆరె మహేందర్ మాట్లాడుతూ పార్లమెంటు ఎన్నికల అనంతరం బీసీ జనగణన పూర్తి చేసి 42 శాతంకు పెంచిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని కోరారు. బీసీ కుల గణన చేస్తామని అసెంబ్లీలో ఇటీవల తీర్మానం చేయడంపై ఆయన హర్షం ప్రకటించారు. వేదిక రాష్ట్ర కోఆర్డినేటర్ దశరథం, గ్రేటర్ అధ్యక్షులు మేడవరపు రాజేష్‌కుమార్, ప్రధానకార్యదర్శి క్రాంతికుమార్, నిఖిల్, అభిషేక్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న అనిల్ థామస్

ఇండియా కూటమిని గెలిపించాలి: అనిల్ థామస్

రాంనగర్, మే 7 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలో ఇండియా కూటమి అధికారంలోకి వస్తేనే క్రైస్తవుల హక్కులు పరిరక్షించబడుతాయని ఏఐసీసీ క్రిష్టియన్ సెల్ అధ్యక్షులు అనిల్ థామస్ అన్నారు. బాకారంలోని వెస్లీ చర్చిలో మంగళవారం క్రైస్తవుల ఆత్మీయ సమ్మేళనానికి అనిల్ థామస్, తెలంగాణ మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ దీపక్ జాన్, మాజీ చైర్మన్ క్రిస్టినా లాజరస్ హాజరై మాట్లాడుతూ ఈ ఎన్నికల్లో క్రైస్తవులందరూ కాంగ్రెస్ అభ్యర్థులకు ఓట్లు వేసి గెలిపించాలన్నారు. ప్రసాద్, శ్రీనివాస్, జగదీష్, కల్పనాయాదవ్ పాల్గొన్నారు.

భారీ వర్షం- అరుంధతినగర్‌లో మోకాలిలోతు నీరు

చిక్కడపల్లి, మే 7 (ఆంధ్రజ్యోతి): మంగళవారం సాయంత్రం కురిసిన భారీ వర్షానికి గాంధీనగర్ డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో నీరు చేరింది. ముఖ్యంగా అరుంధతినగర్ బస్తీలో మోకాలిలోతు నీరు చేరడంతో రాకపోకలకు ఇబ్బందులు ఎదురయ్యాయి. బస్తీ ప్రజలు బయటకు రావాలంటేనే జంకే పరిస్థితి ఏర్పడింది. పక్కన ఉన్న హుస్సేన్‌సాగర్ కాలువలోకి వరదనీరు వెళ్లే విధంగా అధికారులు చర్యలు తీసుకోకపోవడంతో చిన్న వర్షం పడినా కూడా బస్తీలో నీరు నిలిచిపోయి ఉంటోందని బస్తీ అధ్యక్షుడు మెరుగు శ్రీనివాస్ ఆరోపించారు. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకోవాలని బస్తీవాసులు కోరుతున్నారు.


అరుంధతినగర్‌లో చేరిన నీరు

రైలు ఢీకొని జీహెచ్‌ఎంసీ స్వీపర్ మృతి

బర్కత్‌పుర, మే 7 (ఆంధ్రజ్యోతి): పట్టాల వెంట నడుచుకుంటూ వెళ్తుండగా రైలు ఢీకొని జీహెచ్‌ఎంసీ స్వీపర్ మృతి చెందింది. కాచిగూడ రైల్వే పీఎస్ సీఐ ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం... బడిచౌడీలో నివాసం ఉంటున్న బాలరాజు భార్య నర్సమ్మ(65) జీహెచ్‌ఎంసీలో స్వీపర్‌గా పనిచేస్తుంది. మంగళవారం ఉప్పుగూడ-ఫలక్‌నామా రైల్వే స్టేషన్ల నడుమ పట్టాల వెంట నడుచుకుంటూ వెళ్తుండగా వెనుక నుంచి వచ్చిన రైలు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో నర్సమ్మకు తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌లు తోడు దొంగలు


ముషీరాబాద్‌లో జరిగిన బీజేపీ కార్నర్ మీటింగ్‌లో మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఆర్ విశ్వం

● బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఆర్ విశ్వం

ముషీరాబాద్, మే 7 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్, బీఆర్‌ఎస్ రెండు పార్టీల నేతలు తోడు దొంగలని ఈ రెండు పార్టీలకు ఓటు వేస్తే ప్రజలు ఐదేండ్లు మోసపోతారని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఆర్ విశ్వం అన్నారు. మంగళవారం ముషీరాబాద్‌లోని శివాలయం చౌరస్తా వద్ద బీజేపీ కార్నర్ మీటింగ్ నిర్వహించారు. సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరయిన విశ్వం మాట్లాడుతూ సికింద్రాబాద్ పార్లమెంటు బీజేపీ అభ్యర్థి కిషన్‌రెడ్డి ఐదేండ్లు ప్రజలకు అందుబాటులో ఉంటూ అభివృద్ధే ధ్యేయంగా పనిచేశారు అన్నారు. మరోసారి కిషన్‌రెడ్డిని గెలిపిస్తే ముషీరాబాద్‌లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కావల్సిన నిధులను విడుదల చేయిస్తారన్నారు. మూడో సారి నరేంద్ర మోదీ ప్రధాని అయ్యేందుకు ప్రజలంతా బీజేపీకి ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో భోలక్‌పూర్ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు రవికుమార్, మీడియా సెల్ ఇన్‌చార్జి బిజ్జి కనకేష్ కుమార్, మహంకాళి జిల్లా దళిత మోర్చా ఉపాధ్యక్షులు కృష్ణ, అధికార ప్రతినిధి చంద్రమోహన్, నాయకులు నిత్యనంద్, రాజేష్, జమాల్‌పురి నందు, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

కిషన్‌రెడ్డి గెలుపుకోసం అంకితభావంతో పనిచేయాలి

చిక్కడపల్లి, మే 7 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ బీజేపీ ఎంపీ అభ్యర్థి కిషన్‌రెడ్డి గెలుపుకోసం నాయకులు, కార్యకర్తలు అంకితభావంతో పనిచేయాలని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి జి. ఆనంద్‌గౌడ్ అన్నారు. గాంధీనగర్ డివిజన్‌లోని చిక్కడపల్లి బాపునగర్ రాజరాజేశ్వరి ఆలయం వద్ద జరిగిన కార్నర్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. ప్రధాని నరేంద్ర మోదీ అమలు చేస్తున్న సంక్షేమపథకాలతో దేశవ్యాప్తంగా లక్షలాది మందికి లబ్ధి చేకూరిందన్నారు. కార్యక్రమంలో డివిజన్ కార్పొరేటర్ ఎ. పావనివినయ్‌కుమార్, పార్లమెంటు బీజేపీ జాయింట్ కన్వీనర్ వినయ్‌కుమార్, డివిజన్ అధ్యక్షుడు రత్నసాయిచంద్ పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఆనంద్‌గౌడ్

గాంధీనగర్‌లో కార్పొరేటర్ ప్రచారం..

చిక్కడపల్లి, మే 7 (ఆంధ్రజ్యోతి): ఈ సారం మోదీ సర్కార్ 400 సీట్లు సాధించాలని గాంధీనగర్ కార్పొరేటర్ పావనివినయ్‌కుమార్ అన్నారు. మంగళవారం డివిజన్‌లోని 132 బూత్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సికింద్రాబాద్ లోక్‌సభ అభ్యర్థి కిషన్ రెడ్డిని గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా కరపత్రాలను అందజేసి ఓటర్లను కలిసి బీజేపీకి ఓటు వేయాలని కోరారు. బీజేపీనేతలు వినయ్ కుమార్, సురేష్, మురళీమోహన్, మితేష్, సుధాకర్, శ్రీనివాస్, మునిందర్, శ్రీచరణ్ తదితరులు పాల్గొన్నారు.


ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న కార్పొరేటర్ పావనివినయ్‌కుమార్

సీబీఐ అధికారులమంటూ

రూ. 91.64 లక్షలు దోచేశారు

హైదరాబాద్ సిటీ, మే 7 (ఆంధ్రజ్యోతి): సీబీఐ అధికారులుగా పరిచయం చేసుకున్న సైబర్ నేరగాళ్లు 'మీ బ్యాంకు ఖాతాల నుంచి విదేశాలకు హవాలా డబ్బు వెళ్లింది' అని బెదిరించి నగరవాసి నుంచి రూ. 91.64 లక్షలు కాజేశారు. నగరానికి చెందిన 74 ఏళ్ల వ్యక్తికి సైబర్ నేరగాళ్లు ఫోన్ చేసి, ఫెడెక్స్ కొరియర్ సర్వీస్‌లో మీ పేరున బ్యాంకాక్ నుంచి థాయ్‌లాండ్‌కు పంపిన పార్శిల్ అడ్రస్ సరిగాలేని కారణంగా తిరిగి వచ్చిందని చెప్పారు. అందులో పాస్‌పోర్టులు, బ్యాంకు పాస్‌పుస్తకాలు, 140 గ్రాముల ఎండీఎంఏతో పాటు, 4 కిలోల దుస్తులు ఉన్నాయని చెప్పారు. దీనిపై కేసు నమోదైందని చెప్పారు. కొద్దిసేపటి తర్వాత వీడియో కాల్ చేసిన సైబర్ నేరగాడు సీబీఐ అధికారిగా పరిచయం చేసుకున్నాడు. 'మీ ఆధార్‌కు అనుసంధానమైన ఖాతాల నుంచి విదేశాలకు 66.88 మిలియన్ల డాలర్ల హవాలా డబ్బు వెళ్లిందని, ఇందులో కొంత మొత్తం బ్యాంకాక్ పోలీసులు సీజ్ చేశారు. మీపై కేసు నమోదైందని, ఏక్షణంలోనైనా అరెస్టయ్యే అవకాశముంది' అని బెదిరించాడు. 'మీ ఖాతాల్లో ఉన్న డబ్బు ఏ మార్గాల్లో వచ్చిందో పరిశీలించి దానికి సంబంధించి సీబీఐ అధికారులు సర్టిఫికెట్ ఇస్తారు' అని చెప్పాడు. అందుకోసం 'మీ దగ్గర ఉన్న డబ్బును సీబీఐ ఖాతాకు బదిలీ చేయాలి' అని సూచించాడు. నమ్మకం కలిగించేందుకు సీబీఐ లెటర్‌హెడ్‌ను చూపించాడు. దాంతో తన ఖాతాలో ఉన్న రూ.91.64 లక్షలు సైబర్ నేరగాడు సూచించిన ఖాతాలోకి పంపాడు. తర్వాత ఫోన్‌లు స్విచ్ఛాఫ్ రావడంతో మోసపోయానని గ్రహించి సైబర్‌క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.


క్రెచ్‌ను ప్రారంభిస్తున్న క్రెడాయ్ హైదరాబాద్ అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి

కార్మికుల పిల్లల కోసం 'క్రెచ్'

● ప్రారంభించిన క్రెడాయ్ హైదరాబాద్

హైదరాబాద్ సిటీ, మే7 (ఆంధ్రజ్యోతి): వివిధ రాష్ట్రాల నుంచి వచ్చి నిర్మాణ రంగంలో పని చేస్తున్న కార్మికులకు క్రెడాయ్ హైదరాబాద్ ప్రత్యేక కార్యక్రమాలను చేపట్టింది. క్రెడాయ్ కేర్స్ కార్యక్రమంలో భాగంగా కార్మికుల పిల్లలకు పని ప్రదేశాల్లోనే ఆటవిడుపు కోసం క్రెచ్‌ను ఏర్పాటు చేశారు. కార్మికుల ఆరోగ్యాన్ని పరీక్షించడానికి అనంత రిహాబ్‌తో కలిసి హెల్త్ చెకప్ క్యాంప్ నిర్వహించారు. ఈ సందర్భంగా క్రెడాయ్ హైదరాబాద్ అధ్యక్షుడు వీ.రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ వ్యవసాయం తర్వాత అతిపెద్ద ఉపాధి కల్పన రంగంగా నిర్మాణరంగం ఉందని, దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో కార్మికులు నగరంలో పని చేస్తున్నారని తెలిపారు. కార్మికుల సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నామని ఆయన వివరించారు. కార్యక్రమంలో ప్రెసిడెంట్ ఎలెక్ట్ ఎన్.జైదీప్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి బీ.జగన్నాథరావులతో పాటు క్రెడాయ్ హైదరాబాద్ మేనేజింగ్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

దేశ సంపదను లూటీ చేస్తున్న బీజేపీని ఓడించాలి

● ఐఎన్‌టీయుసీ నేతలు

బర్కత్‌పుర, మే 7 (ఆంధ్రజ్యోతి): దేశ సంపదను లూటీ చేస్తున్న బీజేపీని ఓడించాలని, ఎంపీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని ఐఎన్‌టీయుసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగన్నగౌడ్ పిలుపునిచ్చారు. కార్మిక సంఘాలు కాంగ్రెస్ పార్టీకి మద్దతు ఇచ్చి ఎంపీ అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని కోరారు. మంగళవారం బర్కత్‌పురలోని ఐఎన్‌టీయూసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఐఎన్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి, ఆర్. డి. చంద్రశేఖర్, ఉపాధ్యక్షుడు విజయ్‌కుమార్, కార్యదర్శులు ఎస్. నర్సింహరెడ్డి, మల్లేష్‌గౌడ్‌లతో కలిసి ఆయన మాట్లాడారు. కార్మిక చట్టాలకు మోదీ ప్రభుత్వం తూట్లు పొడిచిందని ఆయన ఆరోపించా రు. పోరాడి సాధించుకున్న ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటీకరణ చేస్తూ లక్షలాది మంది కార్మికులను రోడ్డున పడేస్తుందని విమర్శించారు. ఐఎన్‌టీయూసీ సూచన మేరకు సీఎం రేవంత్‌రెడ్డి ఆర్టీసీ ఉద్యోగులకు 21 శాతం ఫిట్‌మెంట్‌తో పాటు ఫిక్స్‌డ్ డిపాజిట్ విడుదల సౌకర్యం కల్పించారన్నారు. ఐఎన్‌టీయుసీ అనుబంధ కార్మిక సంఘాలు, ప్రభుత్వ రంగ సంస్థల కార్మికులు, అసంఘటిత రంగ కార్మికులు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల గెలుపుకోసం కృషి చేయాలని కోరారు.


సమావేశంలో అభివాదం చేస్తున్న ఐఎన్‌టీయుసీ నేతలు

రాంనగర్, మే 7 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ అమలుచేస్తున్న ఆరు గ్యారంటీలే పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపిస్తాయని టీపీసీసీ రాష్ట్ర సీనియర్ నాయకులు, అంబర్‌పేట కాంగ్రెస్ ఎన్నికల ఇన్‌చార్జి నాగభూషణం అన్నారు. అంబర్‌పేటలో కాంగ్రెస్ పార్టీ బలంగా ఉందన్నారు.

రైల్వే స్టేషన్‌లో మద్యం బాటిళ్ల పట్టివేత

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, మే 7 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో ఆకస్మిక తనిఖీలు చేపట్టామని సికింద్రాబాద్ ఆర్పీఎఫ్ ఎస్సై ఎంవి రెడ్డి తెలిపారు. మంగళవారం సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో ఆర్పీఎఫ్ సీఐ సరస్వత్, జీఆర్పీ సీఐ సాయి ఈశ్వర్‌గౌడ్‌ల సంయుక్త ఆధ్వర్యంలో ఆర్పీఎఫ్ ఎస్సై వెంకట్‌రెడ్డి, జీఆర్పీ ఎస్సై రమేష్, అశోక్ సింగ్‌లతో పాటు ఆర్పీఎఫ్, జీఆర్పీ కానిస్టేబుళ్లు తనిఖీలు చేస్తుండగా ఫుట్‌ఓవర్ బ్రిడ్జి వద్ద ఒక బాక్సు కనిపించింది. తెరిచి చూడగా అందులో రూ.23,270వేల విలువ చేసే ఖరీదైన మద్యం బాటిళ్లు ఉన్నట్లు తెలుసుకుని వెంటనే మద్యం బాటిళ్లను సికింద్రాబాద్ అసిస్టెంట్ ఎక్సైజ్ అధికారిణి సౌజన్యకు అప్పగించారు. మద్యం బాటిళ్లను తీసుకొచ్చిన వ్యక్తిపై ఆరా తీస్తున్నారు.


రైల్వే స్టేషన్‌లో మద్యం బాటిళ్లను పట్టుకున్న ఆర్పీఎఫ్ పోలీసులు

వినియోగదారులు జాగ్రత్తగా ఉండాలి

చిక్కడపల్లి, మే 7 (ఆంధ్రజ్యోతి): మార్కెట్‌లో వస్తువుల కొనుగోలు సమయంలో వినియోగదారులు జాగ్రత్తగా ఉండాలని నేషనల్ కన్స్యూమర్ రైట్స్ కమిషన్ రాష్ట్ర చైర్మన్ వల్దాస్ చంద్రశేఖర్‌గౌడ్ అన్నారు. మంగళవారం చిక్కడపల్లిలో జరిగిన కమిషన్ సభ్యుల సమావేశంలో చంద్రశేఖర్‌గౌడ్‌మా ట్లాడుతూ వినియోగదారులు కన్స్యూమర్‌రైట్స్ గురించి తెలుసుకున్నప్పుడే ప్రశ్నించగలుగుతారన్నారు. ఈ మధ్య కాలంలో మార్కెట్‌లో అనేక మోసాలు, అవకతవకలు జరుగుతున్నాయని వీటి పట్ల జాగ్రత్తగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి ఒక్కరూ కన్స్యూమర్ రైట్స్ గురించి తెలుసుకోవాలని ఇందుకు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఈ సదస్సుకు ప్రతి ఒక్కరూ హాజరై హక్కుల గురించి తెలుసుకుని పదిమందికి ఉపయోగపడాలన్నారు. సమావేశంలో కుమరి శ్రీకాంత్, వినోద్‌కుమార్, వినయ్ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న చంద్రశేఖర్‌గౌడ్


సమావేశంలో మాట్లాడుతున్న నందకిషోర్

అణగారినవర్గాలు బీఆర్‌ఎస్‌కు అండగా నిలవాలి

రాంనగర్, మే 7 (ఆంధ్రజ్యోతి): పార్లమెంటు ఎన్నికల్లో అణగారిన వర్గాలు బీఆర్‌ఎస్‌కు అండగా నిలవాలని తెలంగాణ ఎమ్మార్పీఎస్ హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జి నందకిషోర్ సూచించారు. మంగళవారం విద్యానగర్‌లోని రాష్ట్ర కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సికింద్రాబాద్ నుంచి పద్మారావును గెలిపించాలన్నారు. నగేష్, సురేష్, చంద్రశేఖర్, శ్యామ్‌రావు పాల్గొన్నారు.


తేజస్వి సూర్యను సత్కరిస్తున్న కర్ణాటక సాహిత్య మందిర్ అధక్షుడు విటల్ జోషి

కన్నడీయులు బీజేపీకి అండగా నిలవాలి

● ఎంపీ, యువ మోర్చా జాతీయ అధ్యక్షుడు తేజస్వి సూర్య

బర్కత్‌పుర, మే 7 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో స్థిరపడిన కన్నడీయులు బీజేపీకి అండగా నిలవాలని, ఎంపీ, యువ మోర్చా జాతీయ అధ్యక్షుడు తేజస్వి సూర్య పిలుపునిచ్చారు. దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందటానికి ప్రధాని మోదీ చేస్తున్న కృషిని ప్రతి ఒక్కరు గుర్తించాలని ఆయన కోరారు. మంగళవారం రాత్రి కాచిగూడలోని కర్ణాటక సాహిత్య మందిర్ అధ్యక్షుడు విటల్ జోషి నివాసానికి వచ్చారు. అక్కడ కర్ణాటకకు చెందిన పలువురు పెద్దలను కలిసి బీజేపీకి ఓటు వేయాలని కేంద్రమంత్రి కిషన్ రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని విన్నవించారు. మరొకసారి ప్రధాని మోదీ అధికారంలోకి రావాలని అన్ని వర్గాల ప్రజలు కోరుకుంటున్నారని ఆయన చెపారు. కర్ణాటకకు చెందిన వారు ఐక్యంగా ఉంటూ సాహిత్య సేవా, విద్యా రంగాలలో ప్రత్యేక గుర్తింపు పొందాలని ఆయన కోరారు.


బాలికను చేరదీసిన సికింద్రాబాద్ ఆర్పీఎఫ్ పోలీసులు

ఆర్పీఎఫ్ పోలీసుల చెంతకు బాలిక

● ప్రభుత్వ హోంకు తరలింపు

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, మే 7 (ఆంధ్రజ్యోతి): రైల్వే స్టేషన్‌లో ఒంటరిగా ఉన్న మూడేళ్ల బాలికను సికింద్రాబాద్ ఆర్పీఎఫ్ పోలీసులు చేరదీసి ప్రభుత్వం హోంకు తరలించారు. సికింద్రాబాద్ ఆర్పీఎఫ్ ఎస్సై ఎంవీ.రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో ప్లాట్ ఫాం నెంబరు 1లోని గేటు నెంబరు 4 వద్ద మూడేళ్ల బాలిక సంక్రాంతన (3) ఏడుస్తూ ఉండగా, ఆ సమయంలో సికింద్రాబాద్ ఆర్పీఎఫ్ ఎస్సై వెంకట్ రెడ్డితో పాటు మహిళా కానిస్టేబుళ్లు వైశాలి, టీవీఎస్.జ్యోతి బాలికను చూసి అక్కున చేర్చుకున్నారు. వెంటనే బాలిక తల్లిదండ్రుల కోసం వాకబు చేసినా ఫలితం లేకపోయింది. బాలికను చైల్డ్ వెల్ఫేర్ కమిటీ అధికారులకు అప్పగించారు.

పోక్సో కేసులో నిందితుడికి 20 ఏళ్ల జైలు

సైదాబాద్, మే 7 (ఆంధ్రజ్యోతి): చిన్నారిపై లైంగిక దాడి కేసులో నిందితుడికి పోక్సో కోర్టు 20 ఏళ్ల జైలు శిక్ష విధించింది. మాదన్నపేట ఇన్‌స్పెక్టర్ బి. శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. మాదన్నపేట ఈద్గా సమీపంలో ఉంటున్న ఆటో డ్రైవర్ మహ్మద్ సలీం(45) 2020లో ఎనిమిదేళ్ల చిన్నారిపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. బాలిక కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. కేసు దర్యాప్తు ప్రారంభించి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. మంగళవారం కేసును విచారించిన స్పెషల్ సెషన్స్ పోక్సో కోర్టు న్యాయాధికారి పి. పుష్పలత నిందితుడు సలీంకు 20 ఏళ్ల జైలు శిక్ష, వెయ్యి రూపాల జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారని ఇన్‌స్పెక్టర్ తెలిపారు.